క్లుప్తంగా

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

జగిత్యాల: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సూచించారు. ఈ మేరకు శనివారం విరూపాక్షి గార్డెన్స్‌లో అల్ఫోర్స్ విద్యాసంస్థల వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఎమ్మెల్యేను అల్ఫోర్స్ గ్రూపు అధినేత నరేందర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపల్ యాస్మిన్, ఏవో రాజేశ్ పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



డిపాజిట్ బాండ్ అందిస్తున్న మిత్రులు

కథలాపూర్: మండలంలోని దూలూర్ గ్రామానికి చెందిన వంగరి లింగేశ్వర్ అనే యువకుడు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. కథలాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో 1995–96లో లింగేశ్వర్‌తో పాటు చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థులు కలిసి రూ.65వేలు జమ చేసి మిత్రుడి కూతురు పేరిట డిపాజిట్ చేశారు.

విద్యార్థి దశ కీలకమైంది



ఒలింపియాడ్ సర్టిఫికెట్లతో విద్యార్థులు

కోరుట్ల: విద్యార్థి దశ కీలకమైందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వాసవి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని లిటిల్ జీనియస్ పాఠశాలలో స్నాతకోత్సవ సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. జీకే, గణితం, ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్లు కె.రాధాకృష్ణ, కె.వినోద, జి.మమత, కరస్పాండెంట్ మహదేవ్, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు

వెల్గటూర్: బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని ఎండపల్లి మండలంలోని సూరారం గ్రామంలో మంగళవారం మండల అధ్యక్షుడు సింహాచలం జగన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ధర్మపురి నియోజకవర్గంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో చర్చ జరిగేలా చూడాలన్నారు. సూరారం సర్పంచ్ బండారి లచ్చయ్య, ఉప సర్పంచ్ కొంగల సత్యనారాయణరెడ్డి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు జాడి లక్ష్మీరాజం పాల్గొన్నారు.

గ్రామస్తులు పరిశుభ్రత పాటించాలి



వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలపై శనివారం అధికారులు గ్రూపులుగా ఏర్పడి ఇంటింటా సర్వే నిర్వహించారు. గ్రామస్తులు వ్యక్తిగత మరుగుదొడ్డి, ఇంకుడు గుంతలు నిర్మించుకొని పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయా, లేదా వివరాలు సేకరించారు. ఇంకుడు గుంత ఉందా లేదా, తడి, పొడి చెత్తను ఏవిధంగా వేరు చేస్తున్నారు అడిగి నమోదు చేసుకున్నారు.మెట్‌పల్లి ఎంపీడీవో భీమేశ్, ఎంపీవో మహేశ్వర్, ఏపీవో తిరుపతిరావు, ఉప సర్పంచ్ రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నారాయణ, నాయకులు నేమూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

అమ్మభాష ఆయన వృత్తి.. ప్రవృత్తి

- ఆకట్టుకునే తెలుగు కవితలు
- సమాజ సమస్యలపై పాటలు
- సంస్కృతి, జీవన విధానం శైలి
- వ్యాఖ్యాతగా, రచయితగా, అనువాదకుడిగా రాణిస్తున్న ఆడెపు శిరీష్

కోరుట్లటౌన్: అమ్మభాష తెలుగుపై మమకారంతో సాహితీ రంగంలో తనదైన ముద్ర వేసుకున్నాడు. సమాజ సమస్యలు, మానవ జీవన విధానాన్ని పాటలు, కవితలు రూపంలో అందిస్తూ కళామతల్లి సేవలో తరిస్తున్నాడు. తెలుగు భాష గొప్పతనం తెలిసేలా కవితా మాటలతో మాల అల్లుతూ అలరిస్తున్నాడు పట్టణానికి చెందిన ఆడెపు శిరీష్. తెలుగు భాషపై పట్టు ఉండటంతో ఇంగ్లిష్ అనువాదకుడిగా కూడా మంచి గుర్తింపు సాధించాడు.



ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చేతుల మీదుగా ప్రశంసాపత్రం, అవార్డు అందుకుంటున్న శిరీష్ (ఫైల్)

అవార్డులు, ప్రశంసలు..

- ప్రపంచ తెలుగు సన్నాహక మహాసభల్లో తన కవితా గానంతో సాహితీ ప్రియులను మెప్పించాడు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఇంగ్లిష్ భాషను తెలుగులో అనువాదం చేయడంలో ప్రతిభ కనబరచి, క్రిసెండో ట్రాన్స్‌కిప్షన్ కంపెనీ ఉత్తమ అనువాదకునిగా 2018లో ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్ అవార్డు, ప్రశంసాపత్రం ఆడెపు శిరీష్ సొంతం చేసుకున్నాడు.



మెమొంటోలతో ఆడెపు శిరీష్

బాల్యం–చదువు..

- కోరుట్ల పట్టణంలో ప్రాథమిక విద్య, హైస్కూల్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేశాడు. అనంతరం 2016లో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ, అనంతపురంలో ఎంఏ తెలుగు పట్టా అందుకున్నారు. 20ఏళ్లుగా ప్రైవేటు ఉపాధ్యాయునిగా పని చేస్తూ, వ్యాఖ్యాతగా, రచయితగా, అనువాదకుడిగా శిరీష్ రాణిస్తున్నారు.

సాహిత్యం వైపు అడుగులు..

- సముద్రాల శ్రీనివాసాచార్యులు, నేరెళ్ల శ్రీరామకృష్ణశాస్త్రి భాషా పండితుల ప్రభావంతో తెలుగు భాషపై పట్టు సాధించాడు. తెలుగు సాహితీ పుస్తకాలు, పత్రికలు చదివి భాషా పరిజ్ఞానం, మెలకువలు నేర్చుకున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు వేదికలపై వ్యాఖ్యాతగా ఆకట్టుకున్నారు. భారతీ సాహిత్య సమితి కవుల ప్రోత్సాహంతో కవితా గానం చేసి, మెప్పు పొందారు. 20 కవి సమ్మేళనాలలో కవితా గానం చేసి సత్కారం పొందాడు. 2017లో ప్రపంచ తెలుగు మహాసభల సన్నాహక సభలో కవితా గానం చేసి ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, కలెక్టర్ చేతుల మీదుగా సన్మానం పొందారు.

ఎస్ఎస్ కీసుపిట్ట యూట్యూబ్ చానల్ ప్రారంభం..

- తెలుగు సాహితీ రంగంలో పాటల రచయితగా ఒక్కో మెట్టు ఎక్కుతున్న ఆడెపు శిరీష్ 2019లో ఎస్ఎస్ కీసుపిట్ట యూట్యూబ్ ఛానల్ ప్రారంభించాడు.

యూట్యూబ్‌లో రిలీజ్ అయిన పాటలు..

- 'మనిషిని నేను మనిషినంటావు ఏడయ్యా నీలోన మనిషి' అంటూ ఎలక్ట్రానిక్ పరికరాలతో సావాసం చేస్తూ తనలోని మనిషిని మరచిపోతున్న పాట ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది.
- ''గూడు చెదిరిపోయే..గుండె బరువైపోయే..గల్ఫ్ సోదరా నీ బాధలు..' అంటూ వలస జీవుల వెతలకు అద్దం పట్టింది.
- ''సారూ ప్రైవేటు సారు..నీ గోడును వినేది ఎవరూ'' పాట
- ''స్వార్థం నిండిన సమాజమా నీతుల రంగులు పులమకుమా' పాట
- 'అమ్మా అని పిలుపే అమృతమే పంచునమ్మా' పాట
- 'జైజైజై జై కోరుట్ల దుర్గమ్మ' పాటలను యూట్యూబ్‌లో విడుదల చేశారు. ఇప్పటివరకు 20 పాటలు రాయగా 10 పాటలు విడుదలయ్యాయి. 10 పాటలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

తెలుగు భాషకు రుణపడి ఉంటా



తెలుగు భాషంటే చాలా ఇష్టం. వృత్తిలోనూ.. ప్రవృత్తిలోనూ భాషతో బతుకుతున్నాను. భాషతోనే నా బతుకు సాగుతున్నందుకు ఆనందంగా ఉంది. ప్రేమించిన భాష ఉపాధి ఇవ్వడమే కాకుండా నాలో ప్రతిభను చాటుకునే అవకాశం కల్పించింది. తెలుగు భాషకు ఎప్పటికీ రుణపడి ఉంటాను.

– ఆడెపు శిరీష్, కోరుట్ల

అన్నివర్గాల సంక్షేమానికి కృషి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

కొడిమ్యాల: కల్యాణలక్ష్మి చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని వివిధ గ్రామాల 27 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ అన్నివర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కొడిమ్యాల: మండల కేంద్రానికి చెందిన సుమారు 60 మంది వివిధ పార్టీలకు చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా సేవ చేయడం అదృష్టం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మురళి

కొండగట్టు: మండలంలోని నాచుపెల్లి జేఎన్‌టీయూ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో వారం పాటు నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో భాగంగా శనివారం కళాశాలలో సమావేశం నిర్వహించారు. కరీంనగర్ ఎస్సారార్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మురళి పాల్గొని మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా సేవ చేసే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. విద్యార్థి దశలోనే సేవచేసే గుణాన్ని అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.ప్రవీణ్‌కుమార్, ఆచార్యులు సత్యనారాయణ, వి.రామిరెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛోత్సవ్ కార్యక్రమాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోరుట్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో స్వచ్ఛోత్సవ్ 2023 కార్యక్రమాలపై అధికారులు శనివారం మహిళలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త వేరు చేయడం, పట్టణంలోని పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకు సేవలు, చెత్త సేకరణ, రవాణా తదితర అంశాల గురించి మున్సిపల్ కమిషనర్ అయాజ్ వివరించారు. సాంకేతిక ఆవిష్కరణలో పాల్గొంటున్న ఔత్సాహిక మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఐదుగురు మహిళలను రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక చేస్తామని కమిషనర్ పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంతో పరిసరాలు శుభ్రం



సర్వే పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో సంతోష్‌కుమార్

మల్లాపూర్: గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంతోనే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని రాయికల్ ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్, గుండంపల్లి గ్రామాల్లో ఎస్‌బీఎం ఓడీఎఫ్ ప్లస్ సర్వేను ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు కడకుంట్ల సాయికుమార్, దనరేకుల మల్లు, ఎంపీటీసీలు మైస లక్ష్మి, మామిడి మంజుల, పీఏసీఎస్ చైర్మన్ నేరేళ్ల మోహన్ రెడ్డి, ఉపసర్పంచ్ నవీన్, వేణు, పంచాయతీ కార్యదర్శులు నారాయణరెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రతి నర్సరీలో ప్రైమరీ బెడ్ ఏర్పాటు చేయాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఏపీడీ బాలె శివాజీ

ఇబ్రహీంపట్నం: ప్రతి నర్సరీలో ప్రైమరీ బెడ్ ఏర్పాటు చేయాలని ఏపీడీ బాలె శివాజీ సూచించారు. ఈ మేరకు శనివారం మండలంలోని డబ్బా, వర్షకొండ గ్రామాల్లోని నర్సరీలు, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో ఒక్క ఫీట్ ఆ పైన ఎత్తు పెరిగిన మొక్కలకు జీవామృతం పిచికారీ చేయాలన్నారు. హరితహారంలో నాటిన ప్రతీ మొక్కను బతికించే బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, పంచాయతీ కార్యదర్శి రాణి, సర్పంచ్ గంగాధర్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కలిగోటలో వడగండ్ల వర్షం



కలిగోటలో ఓ ఇంటి ఆవరణలో కురిసిన వడగండ్లు

కథలాపూర్: మండలంలోని కలిగోట గ్రామంలో శనివారం సాయంత్రం వడగండ్ల వర్షం కురిసింది. ప్రజలు వడగళ్లను చూసి సంతోషపడ్డారు. మండలంలోని మిగతా గ్రామాల్లో చిరుజల్లుల వర్షం కురిసింది. సాయంత్రం వేళ వర్షం కొద్దిగానే కురవడంతో పంటలకు నష్టం జరగలేదని ఆయా గ్రామాల రైతులు తెలిపారు.

సారంగాపూర్, బీర్‌పూర్‌లో భారీ వర్షం

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి ఏడున్నర గంటల ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. సారంగాపూర్ మండల కేంద్రంలో భారీ ఎత్తున ఈదురు గాలులు, ఉరుములు, పిడుగులతో కూడిన వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

పేద ప్రజల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

సారంగాపూర్: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని, సంక్షేమ పథకాల అమలు విషయంలో ప్రభుత్వం రాజీపడదని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన రంగపేట, ఒడ్డెర కాలనీ గ్రామాల్లో 'మీరు నేను' కార్యక్రమంలో భాగంగా ఉదయం 6గంటల నుంచే పర్యటించి పలు చోట్ల గ్రామస్తులతో మాట్లాడారు. కాగా శుక్రవారం రాత్రి రంగపేటలో పల్లెనిద్ర చేసిన అనంతరం ఉదయం నుంచే పలు వార్డుల్లో పర్యటిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం వెచ్చించిన నిధుల వివరాలను ప్రకటించారు. రంగపేటలో ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి మంజూరైన రూ.4.91లక్షల చెక్కు అందజేశారు. ఆయన వెంట ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌రావు, ఎంపీడీవో రాజేందర్, వైస్‌ఎంపీపీ సొల్లు సురేందర్, సర్పంచ్‌లు బెక్కెం జమున, పల్లపు వెంకటేశ్, గుర్రాల రాజేందర్‌రెడ్డి, కాసుగంటి వెంకటరమణారావు, విండో వైస్‌చైర్మన్ పల్లపు బాపురాజు, నాయకులు అనంతుల గంగారెడ్డి, బిట్ల రమేశ్, చిట్నేని రవీందర్‌రావు, బోదాసు రామానుజం, నాంపల్లి పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



బాదినేని దంపతులకు ప్రసాదం

ధర్మపురి: బుగ్గారం ఎంపీపీ, జెడ్పీటీసీ బాదినేని రాజేందర్, రాజమణి పెళ్లిరోజు సందర్భంగా శనివారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. దంపతులకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందించారు.

సంక్షిప్త వార్తలు

✦ తైబజార్ వేలం వాయిదా

మెట్‌పల్లి: 2023–24కి సంబంధించి తైబజార్ ఫీజు వసూలు కోసం శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన బహిరంగ వేలంలో కాంట్రాక్టర్లు పాల్గొనలేదు. ప్రభుత్వం నిర్దేశించిన ధర అధికంగా ఉండడంతో ఒక్క కాంట్రాక్టర్ కూడా ఆసక్తి చూపలేదు. దీంతో వేలం 21వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు.

✦ ప్రతీ సోమవారం ప్రజావాణి

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం నుంచి ప్రజావాణి నిర్వహించనున్నట్లు తహసీల్దార్లు రవీందర్‌రావు, శ్రీలత తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30గంట వరకు ప్రజావాణి ఉంటుందని పేర్కొన్నారు.

✦ ఎస్సైకి సన్మానం

కథలాపూర్: కథలాపూర్ ఎస్సై శ్వేతను బీఎస్పీ మండల నాయకులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో బీఎస్పీ మండలాధ్యక్షుడు శేఖర్, నాయకులు నీలకంఠం, సంజీవ్, మహేశ్ పాల్గొన్నారు.

✦ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు

గొల్లపల్లి: మండలంలోని రంఘదాముని పల్లి నుంచి నంచర్ల గ్రామానికి వెళ్లే రహదారిపై వంతెన నిర్మాణానికి రూ.కోటి నిధులను మంత్రి కొప్పుల ఈశ్వర్ మంజూరు చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు జెగిరిశెట్టి స్వామి తెలిపారు. అలాగే గ్రామంలో ఉన్న వంతెన నిర్మాణానికి సైతం రూ.17లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

✦ గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అందిస్తా

ఇబ్రహీంపట్నం: గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అందిస్తానని వైద్యాధికారి శ్రీజ తెలిపారు. కాగా శుక్రవారం ఇబ్రహీంపట్నం వైద్యాధికారిగా ఆమె బాధ్యతలు చేపట్టారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారిగా ఆమె నియామకయ్యారు. ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు సేవలు అందిస్తానని తెలిపారు. ఫార్మసిస్ట్ ఉదయ్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ నరేశ్ ఉన్నారు.

✦ తైబజార్‌కు వేలం

రాయికల్: పట్టణంలో తైబజార్‌కు శనివారం మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించగా అల్లె దశరథం రూ.4.75 లక్షలకు దక్కించుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ తెలిపారు. మేనేజర్ వెంకట్, జూనియర్ అసిస్టెంట్ అశోక్, అశ్విని, హరీశ్ పాల్గొన్నారు.

✦ పరామర్శ

ధర్మపురి: మండలంలోని తీగలధర్మారానికి చెందిన వేముల లలితమ్మ ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. కాగా శనివారం మృతుని కుటుంబాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు.

✦ మొక్కలు నాటిన యూత్ సభ్యులు

కోరుట్లరూరల్: మండలంలోని పైడిమడుగు గ్రామ శివారులో గల అమ్మవారి మర్రి చెట్టు ఆవరణలో గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో శనివారం మర్రి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ దమ్మ భీమారెడ్డి, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

✦ కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

జగిత్యాలరూరల్: సెర్ప్ ఉద్యోగులకు పేస్కేలు వర్తింపజేస్తూ సీఎం కేసీఆర్ శనివారం జీవో నంబరు 11 విడుదల చేయగా జగిత్యాల మండల సెర్ప్ కార్యాలయంలో ఉద్యోగులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ గంగాధర్, జిల్లా డీపీఎం మల్లేశం, ఏపీఎం గంగాధర్, సీసీలు రవీందర్, గంగారాం, విద్యాసాగర్, సంతోష్ పాల్గొన్నారు.

✦ కొడిమ్యాలలో..

కొడిమ్యాల: సెర్ప్ ఉద్యోగుల పేస్కేలు అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై మండల సెర్ప్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి శనివారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం దేవరాజ్, సీసీలు పద్మ, శ్రీనివాస్, వీరకుమార్, మంగ పాల్గొన్నారు.


నర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న జువ్వాడి క్రిష్ణారావు

ఇబ్రహీంపట్నం: మండలంలోని కోమటికొండాపూర్ గ్రామంలో శనివారం శ్రీలక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపనలో కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి క్రిష్ణారావు, టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దుదిగాం గంగాధర్, మాజీ సర్పంచ్ బన్న పెద్దులు, ఇట్టెడి శ్రీనివాస్‌రెడ్డి, తిరుమల గంగాధర్, విజయ్, మహ్మద్ నజీర్, సురకంటి దినేశ్‌రెడ్డి, భరత్‌రెడ్డి, బైండ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

విఠలేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మెట్‌పల్లి: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీవిఠలేశ్వరస్వామి ఆలయ వార్షిక వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అర్చకులు భాస్కరశర్మ, బాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో రుక్మిణీ సమేత విఠలేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు.

డీసీబీ బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామంలో డీసీబీ (డెవలప్‌మెంట్ క్రెడిట్ బ్యాంక్) ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు బ్యాంక్ మేనేజర్ ఈగ రాజేశం తెలిపారు. తుంగూర్ వ్యాపారం విస్తరించడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆడెపు నర్సయ్య, ఆడెపు రవి, చుక్క రమేశ్, ఓగుల అజయ్ ఉన్నారు.

స్వయం ఉపాధి యూనిట్లతో ఆర్థికాభివృద్ధి



లబ్ధిదారుల ఎంపికలో ఎంపీడీవో, ఎంపీపీ

జగిత్యాలరూరల్: స్వయం ఉపాధి యూనిట్లతో ఆర్థికాభివృద్ధి సాధించాలని జగిత్యాల ఎంపీడీవో శైలజరాణి సూచించారు. ఈ మేరకు శనివారం జగిత్యాల మండల పరిషత్ కార్యాలయంలో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన ఆరు యూనిట్ల లబ్ధిదారులను లక్కీడ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ములాసపు లక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు మెట్‌పల్లిలో కవి, గాయక సమ్మేళనం

మెట్‌పల్లి: ఉగాదిని పురస్కరించుకొని పట్టణంలోని దుబ్బవాడలో గల విశ్వకర్మ భవనంలో సోమవారం లలిత కళా సమితి ఆధ్వర్యంలో కవి, గాయక సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు మట్టెల గంగాధర్ తెలిపారు. సాయంత్రం 4:30కు జరిగే కార్యక్రమంలో ఆసక్తి గల కళాకారులు నేరుగా హాజరు కావాలని ఆయన సూచించారు.

కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ

రాయికల్: మండలంలోని తాట్లవాయిలోని రామాలయం కల్యాణ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ రూ.8 లక్షలు మంజూరు చేయగా శనివారం ఎంపీపీ లావుద్య సంధ్యారాణి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు రాగి సాగరిక, నందునా యక్, మారంపల్లి స్నేహ, ఉపసర్పంచులు ఆకుల మల్లేశం, పాలకుర్తి వెంకటేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రంజిత్, చిరంజీవి, గంగాధర్, ఆలయ కమిటీ చైర్మన్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న ఓగుల అజయ్

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామంలోని హనుమాన్ ఆలయ పునఃనిర్మాణానికి తుంగూర్ గ్రామానికి చెందిన ఓగుల అజయ్ రూ.50వేలు అందజేశారు. ఆలయ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ నల్ల మహిపాల్‌రెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారపాక రమేశ్ ఉన్నారు.

కార్యవర్గం ప్రమాణ స్వీకారం

మెట్‌పల్లి: పట్టణ విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘ నూతన కార్యవర్గం ఇటీవల ఎన్నికైంది. కాగా శుక్రవారం రాత్రి సంఘ భవనంలో ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ మేరకు అధ్యక్షుడిగా గెలిచిన పులిమామిడి చంద్రయ్య, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.